నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

బస్సుల కోసం అగచాట్లు

- ముగిసిన సెలవులు
- నేటి నుంచి విద్యా సంస్థలు పునఃప్రారంభం
- ఆర్‌టిసి బస్సులు కిటకిట
- సీట్లకోసం విద్యార్థుల పాట్లు
- అదనపు బస్సులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం

బస్సులో సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - రాయచోటి

సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 10 నుంచి 19 వరకు విద్యా సంస్థలకు సెలవులు ముగిశాయి. సోమవారం పునః ప్రారంభం కావడంతో సంక్రాంతి పండగ వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు తిరిగి తిరుపతి, మదనపల్లి, బెంగళూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అందరూ రాయచోటి ఆర్‌టిసి బస్టాండ్‌కు రావడంతో బస్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. అన్నమయ్య జిల్లాలో ఐదు డిపోలు ఉన్నాయి. జిల్లా నుంచి సంక్రాంతి పండుగ సందర్భంగా 141 బస్సులు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు తిరిగి పాఠశాలలు, కళాశాలకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైనప్పటికీ సకాలంలో బస్సులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేలాది మంది విద్యార్థులు విద్యాభ్యాసం కోసం రాయచోటి నుండి తిరుపతికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. బస్సులు కొరత వల్ల బస్టాండ్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. ఆగి ఆగక ముందే బస్సులో సీట్ల కోసం విద్యార్థులు ఎగబడ్డారు. సకాలంలో కళాశాలకు చేరుకోకపోతే అక్కడ వారి విధించే పెనాల్టీలు కట్టలేక బస్సుల కోసం ఇబ్బందులు పడ్డారు. బస్సుల కొరత వల్ల సీట్ల కోసం చిన్నపాటి గొడవలు కూడా చోటు చేసుకున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం పలువురు ప్రయాణికులు తీవ్ర మనోవేదనకు గురి అయ్యారు. చాలామంది సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాయచోటి జిల్లా ప్రాంతానికి వచ్చినవారు తిరిగి బెంగళూరు, మదనపల్లి, తిరుపతి, నెల్లూరు తదితర ప్రాంతాలకు తిరిగి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలామంది బస్టాండ్‌కు వచ్చి బస్సులు దొరక్క తిరిగి ఇంటి ముఖం బట్టి తెల్లవారి వెళ్లొచ్చులే అనే పరిస్థితి నెలకొంది. మరికొందరు ఏకంగా ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాసలకు లోనైన ప్రయాణికులు ఇక పండగలకు సొంత ఇళ్లకు రావాలంటే భయపడేలా ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ ఇక్కట్లను దృష్టిలో ఉంచుకుని సరిపడబస్సులను ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

రాయచోటి బంగ్లా వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

ప్రతిసారి ఇబ్బంది పడుతున్నాం

ఏదైనా సెలవులు, పండగలకు వచ్చిన సమయంలో సొంత ఊరికి వచ్చిన ప్రతిసారీ బస్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నాం. మదనపల్లె, తిరుపతికి ప్రత్యేకమైన బస్సులను నడపాలి.

- రాజేష్, ప్రయాణికుడు, రాయచోటి.

స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశాం

సంక్రాంతి పండగ సెలవుల సందర్భంగా జిల్లా నుండి 141 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశాం. ఆదివారం కడప, రాజంపేట, కర్నూల్ ఇతర ప్రాంతాల వెళ్లే బస్సులను రద్దుచేసి విద్యార్థులు సమస్యను దృష్టిలో ఉంచుకొని తిరుపతికి 12 బస్సులను అదనంగా ఏర్పాటు చేశాం.

- రాము, జిల్లా ప్రజా రవాణా అధికారి , రాయచోటి, అన్నమయ్య.

అమిత్‌షా గో బ్యాక్

కేంద్ర హోం మంత్రి రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

భారత రాజ్యాంగంపై విలువలేని అమిత్‌షా దేశంలో ఉండడానికి అర్హత లేదని వామపక్ష నాయకులు పేర్కొన్నారు. అమిత్‌షా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం ఉదయం రాజంపేట ఎన్‌టిఆర్ కూడలి లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో అమిత్‌షా గో బ్యాక్ అంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవ మానకరమైన, భారత రాజ్యాంగాన్ని అప్రతిష్ట పాలు చేసే విధంగా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. విజయవాడ పర్యటనకు రావడం అంటే రాజ్యాంగాన్ని అభిమానించే వారిని అవమానించడమేనని అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా బిజెపి వైఖరిలో మార్పులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కసారి బిజెపి ప్రభుత్వ వికృత చేష్టలను ప్రజలు అర్థం చేసుకోవాలని, అలాంటి రాజ్యాంగ విలువలు తెలియని వారికి ఈ దేశంలో ఉండే అర్హత లేదని తెలిపారు. అన్ని తరగతుల, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజాసంఘాలు కేంద్ర ప్రభు త్వ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, సిపిఎం నాయకులు పందికాళ్ల మణి, సిపిఐ, సిపిఎం నాయకులు నాగేశ్వరరావు, రమణ, లక్ష్మీదేవి ,రాఘవ, నాని, వెంకటేష్, లక్ష్మీకర్, విటల్, కేశవులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ పట్టణంలోని జ్యోతి చౌక్ నందు గల అంబేద్కర్ విగ్రహం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కేంద్ర మంత్రి అమిత్ షా గో బ్యాక్, బిజెపి ప్రభుత్వం అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలంటూ నినాదాలు చేశారు. పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ అమిత్‌షా మాట్లాడిన తీరు మనవాద వైఖరికి అద్దం పడుతున్నదని ఆవేదన చెందారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిలు అమిత్ షాను పలెత్తి మాట్లాడకపోగా,రాష్ట్ర పర్యటన సందర్భంగా రెడ్ కార్పెట్ పరుస్తూ గులాములు కొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్.తంబయ్యశెట్టి, ఎం.గంగులప్ప, జి.నారాయణస్వామి, మనోహర్, రమణ,షఫీ, హబీబ్ పాల్గొన్నారు.

రాజంపేట : నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రభుత్వాస్పత్రి పరిరక్షణ కోసం సామూహిక దీక్షలు

సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిని ప్రయివేట్ పరం కాకుండా పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న సామూహిక దీక్షలు జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మదనపల్లి సర్వజన బోధన ఆసుపత్రిని ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్వహించాలని నిర్వహిస్తున్న సామూహిక దీక్షలు ప్రచార కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రి గత వందేళ్లుగా ఎంతో మంది పేద రోగులకు వైద్య చికిత్సలు అందించి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. పీలేరు, తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గ ప్రజలతో పాటు కర్ణాటక ప్రాంత ప్రజలు కూడా ఇక్కడికే వచ్చి వైద్యం చేయించుకుంటారని అన్నారు. మదనపల్లి ధర్మాసుపత్రిగా పేరుగాంచిన ప్రభుత్వ ఆస్పత్రిని గత ప్రభుత్వం జిల్లా ఆస్పత్రిగా, తర్వాత రోజుల్లో సర్వజన బోధనాసుపత్రిగా అభివృద్ధి చేయడంతో ప్రజలందరూ హర్షించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలకు గ్రహణం పట్టిందని, ఇక్కడున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆస్పత్రిని ప్రయివేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో వైద్యం అందక చనిపోవడం లాంటి బాధల నుంచి విముక్తి ఉంటుందని భావించిన ప్రజలపై కూటమి ప్రభుత్వం పిడుగు వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోధనా ఆస్పత్రిని కాపాడుకోవడానికి ప్రజలు అందరూ ఐక్యంగా పోరాటం చెయ్యాలని, సిపిఎం ప్రారంభం చేసిన ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రి రక్షణకై జరుగుతున్న సామూహిక దీక్షలను జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లాకార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రుల్లో పేదలను వివిధ రకాల పరీక్షల పేరిట దోచుకుంటున్నారన్నారని, పేదలకు అండగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి కూడా ప్రయివేట్ పరమైతే ఇక సామాన్యుడు వైద్యం చేసుకునే పరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని సర్వజన బోధన ఆసుపత్రి గానే ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం జరుగుతున్న ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, రఘునాథ్, వెంకటరమణ నాయుడు, నారాయణ, నావాజ్, రమణ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సామూహిక దీక్షల కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

హామీలు అమలు చేయాలి :'సిటు'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టౌన్ హాల్‌లో మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు 17 రోజుల సమ్మె సందర్భంగా హామీలు, జిఒలు రాతపూర్వకంగా ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని 7 నెలల నుంచి కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదన్నారు. మరణించిన కార్మికులకు రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రమాదంతో మరణించిన కార్మికులకు రూ.7లక్షలు, ఉద్యోగవిరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఇఎస్‌ఐ సమస్య పరిష్కరించాలని కోరారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ సౌకర్యం, జిఒ నెంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు, దినసరి వేతన కార్మికులకు రూ.26వేల జీతం ఇవ్వాలన్నారు. కార్మికులకు పనిముట్లు, బట్టలు, సబ్బులు, చెప్పులు, శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు, చీపుర్లు వెంటనే ఇవ్వాలన్నారు. 279జిఒ ప్రకారం 250 నుంచి 500 జనాభా నివసిస్తున్న చోట ఆరు మంది కార్మికులను పనిలో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజేశ్వరి, మధురవాణి, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, రఘునాథ్, మున్సిపల్ కార్మికులు కృష్ణప్ప, రమణ, పార్వతి, రమణమ్మ పాల్గొన్నారు.

సిఐటియులో 50 మంది మున్సిపల్ కార్మికులు చేరిక

మదనపల్లి మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న 50 మంది మున్సిపల్ కార్మికులు సిఐటియులో చేరారు. ఆదివారం టౌన్‌హాల్‌లో జరిగిన మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశంలో పట్టణంలో ఉన్న ఆరు వార్డుల నుంచి కార్మికులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు పి.రాజేశ్వరి, డి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మధురవాణి వారికి సిఐటియు కండువా వేసి ఆహ్వానించారు.

సిఐటియులో చేరిన 50 మంది మున్సిపల్ కార్మికులు

మదనపల్లి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నూతన మదనపల్లి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.చలపతి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సాంబశివ నాయక్, ఉపాధ్యక్షులుగా రాజు, గోపాల్, నరసింహులు, చిన్న రెడ్డెప్ప, బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా శ్రీరాములు, మునుస్వామి నాయక్, చంద్ర, కోశాధికారిగా పి.రామకృష్ణతో పాటు మరో 8మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత

రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు అధిక నిధులు ఖర్చు చేస్తూ రోడ్లు అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలపరిధిలోని చెన్నమ్మక్కపల్లి గ్రామం, దూల్లవారిపల్లె రోడ్డులో రూ. 80 లక్షలతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉన్నాయని, నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామానికీ, సిమెంట్, తారు రోడ్లు వేసి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు, బ్రిడ్జి నిర్మాణాలకు అధిక నిధులు ఖర్చు చేస్తూ అభివృద్ధి చేస్తుందని చెప్పారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాలలోని ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. దూల్లవారిపల్లెలో రూ. 80 లక్షలలతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి క్వాలిటీ మెటీరియల్ వాడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపం కనిపిస్తే సహించేది లేదన్నారు.

కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలంటున్న గ్రామస్తులు

కబ్జా స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కబ్జా చేసిన స్థలాలను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిటియం పంచాయతీ నల్లగుండ్లపల్లి వాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సిటిఎం గ్రామ స్తులు చిట్లాకుప్ప వేసుకోవడానికి గతంలో ప్రభుత్వం సర్వే నెంబర్ 354లో 1.80 సెంట్లు భూమిని కేటాయించింద న్నారు. ఈ భూమిని స్థానిక సిటిఎం గ్రామంలో ఉన్న ఎంపిపి వెలుగు రెడ్డమ్మ, ఆమె భర్త వెలుగు చంద్ర, సర్పంచ్ ఆనం ద్ పార్థసారథి ఆక్రమించుకొని అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జా చేసిన స్థలాలన్నీ ప్రభుత్వ స్వాధీనం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు కృష్ణమూర్తి, వెంకటరమణ, నాగేంద్ర, నాగరాజు, రఘు, రెడ్డిలీల పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం: 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని పులపుత్తూరు గ్రామపంచాయతీలో ఆదివారం రూ.7 లక్షల నిధులతో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ అన్నమయ్య డ్యాం ముంపు బాధితులకు మౌలిక వసతులు రోడ్లు, ఇంళ్లు, తాగునీరు వంటి ప్రధానమైన వసతులు కల్పిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పులపుతూరు గ్రామస్తులు చమర్తి జగన్ రాజుతో పాటు టిడిపి నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్ రాజు, టిడిపి మండల అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, ఉపాధ్యక్షులు ఆర్.సతీష్‌రాజు, పట్టణ అధ్యక్షులు డిఆర్ఎల్ మణి, సుబ్రహ్మణ్యం నాయుడు, అసెంబ్లీ వాణిజ్య ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, పరుశురాం నాయుడు, గ్రామ టిడిపి అధ్యక్షులు మల్లిఖార్జున రాజు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హాకీ విజేత కడప జట్టు

-నాలుగో స్థానంలో అన్నమయ్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

14వ హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ ఫైనల్‌లో కడప జట్టు ప్రతిభ కనబర్చి ప్రత్యర్థి అనకాపల్లి జట్టు పై 3 -1 గోల్స్ తేడాతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. మదనపల్లె బిటి కళాశాల మైదానంలో నాలుగు రోజుల పాటు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలు నిర్వహించారు. ఆదివారం మూడు, నాలుగు స్థానాలకు జరిగిన పోటీలో తిరుపతి, అన్నమయ్య జట్లు పోటీ పడగా తిరుపతి జట్టు గెలుపొంది మూడో స్థానం దక్కించుకోగా, అన్నమయ్య జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఆ తరువాత ఫైనల్ మ్యాచ్ లో కడప, అనకాపల్లి జట్లు తలపడగా అనకాపల్లి జిల్లా క్రీడాకారుడు మోహిత్ చరణ్1 గోల్ చేయగా, కడప జిల్లా క్రీడాకారుడు గంగా చైతన్య 53వ నిమిషంలో 1 గోల్ చేయడం తో స్కోర్ సమం అయ్యింది. ఆట ముగిసే సమయానికి ఇరుజట్లు 1-1 గోల్స్ తో సమానంగా ఉండడంతో షట్ అవుట్ (ట్రైప్ బ్రేక్)లో రెండు జట్లు తలపడగా కడప జిల్లా 2 గోల్స్ అనకాపల్లి జిల్లా ఒక గోల్ సాధించడంతో కడప జిల్లా జట్టు 3 గోల్స్‌తో విజయం సాధించింది. ఈ హాకీ పోటీల కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు జానకిరాజు, ట్రెజరర్ థామస్ పీటర్, ఆదిత్య విద్యాసంస్థల అధినేత రామలింగరెడ్డి పాల్గొని క్రీడాకారు లను పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో ఫైనల్ విజేత కడప జట్టుకు రామ లింగారెడ్డి, విద్యాసాగర్ మొమెంటోలు, మెడల్స్ అందించారు. రెండో స్థానంలో నిలిచిన అనకాపల్లి జట్టుకు రామ లింగారెడ్డి మొమెంటో అందించారు. మూడో స్థానం గెలుపొందిన తిరుపతి జట్టుకు హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చాణి క్యరాజు అందించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మనీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హాకీ అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్, ప్రసాద్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వివిధ జిల్లాల కోచ్ మేనేజర్లు, అంపైర్లు పాల్గొన్నారు.

తలపడుతున్న కడప, అనకాపల్లి జట్లు

వేమన పద్యం సైద్ధాంతిక రత్నం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : సమాజంలోని మూఢవిశ్వాసాలను, కులమత భేదాలను, పేద, ధనిక అసమానతలను తూర్పారబట్టిన వేమన పద్యం సైద్ధాంతిక రత్నమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం వేమన జయంతి నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహితీ చరిత్రలో వేమనది ఒక ప్రత్యేక అధ్యాయమని, అలతి అలతి పద్యాలతో సంఘసంస్కరణ దిశగా కవిత్వాన్ని అల్లిన ప్రజాకవి వేమనని అన్నారు. వేమన ఆశించిన నవసమాజం మన లక్ష్యం కావాలని పేర్కొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి కృషి

జిల్లా భూ రికార్డుల సర్వే సహాయ సంచాలకులు భరత్ కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

ముఖా ముఖి..

జిల్లాలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని జిల్లా భూ రికార్డుల, సర్వే శాఖ సహాయ సంచాలకులు భరత్ కుమార్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో భూముల వివరాలు, భూ సమస్యలు, భూముల సర్వేలు ఏ విధంగా చేయాలో,ప్రజలు భూ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఎన్ని గ్రామాలు,? సర్వేయర్ల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలో 470 రెవెన్యూ గ్రామాలున్నాయి. జిల్లాలో మొత్తం 383 మంది గ్రామ సర్వేయర్లు, 33 మంది మండల సర్వేయర్లు ఉన్నారు.

జిల్లాలో భూమి విస్తీర్ణం ఎంత?

జిల్లా వ్యాప్తంగా భూమి విస్తీర్ణం 15,86,129. ఎకరాల, 96 సెంట్లు విస్తీర్ణం ఉంది.

రీ సర్వే ఎన్ని గ్రామాల్లో నిర్వహించారు?

జిల్లాలో 470 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటి వరకు 138 గ్రామాలలో రీ సర్వేని నిర్వహించాం.

భూ సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రజల నుంచి వస్తున్న వివిధ రకాలైన సర్వేకు సంబంధించిన సేవలను అంటే.. యఫ్-లైన్ ఫితిస్తిఒన్, ఆన్‌లైన్ సబ్ డివిజన్, పట్టా సబ్ డివిజన్ వంటి సేవలను నిర్ణీత గడువులో పరిష్కరిస్తున్నాం. ప్రతి సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చే అనేక భూ సంబంధిత ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సర్వే నిర్వహించి సదరు అర్జీదారుడి సమస్యను నాణ్యతతో పరిష్కరిస్తున్నాం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో రెవెన్యూ సదసులు నిర్వహించి అక్కడ వచ్చినటువంటి భూ సంబంధిత సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరిస్తాం.

సర్వే చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనా?

సర్వే చేయాలంటే ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా తమ సిబ్బంది అడుగుతున్నారని ప్రజల ఫిర్యాదు చేస్తే క్షేత్ర స్థాయి నుంచి మా దృష్టికి వస్తే తక్షణం సదరు సర్వే అధికారిపై చర్య తీసుకుంటాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

గతంలో భూ రికార్డుల సర్వే శాఖలో సిబ్బంది కొరత సమస్య ఉండేది. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి సిబ్బం ది కొరతలేదు.

ప్రజలకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

జనవరి 20 నుండి ప్రభుత్వం రీసర్వే చేపడుతుంది. రీసర్వే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తారు. ప్రజలందరూ రీసర్వేకు సహకరించాలి. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు భూ సమస్యలు ఏమైనా ఉంటే తమ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చు.


మైక్‌సెట్‌ను అందజేస్తున్న సర్పంచ్

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలకు సర్పంచ్ హలీమా దంపతులు రూ.15 వేలు విలువచేసే మైక్‌సెట్‌ను పాఠశాలకు వితరణగా ఇవ్వడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ తెలియజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఉదయం ప్రార్థన సమావేశానికి, పాఠశాల సమావేశాలు జరిగినప్పుడు మాట్లాడడానికి పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సర్పంచ్ దంపతులు మైక్ పాఠశాలకు వితరణగా ఇవ్వడం సంతోష దాయకమని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడు ముందంజలో ఉంటామని విద్యార్థులకు ఎలాంటి సహాయం అవసరమైన చేయడానికి ముందుంటామని పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు తోడ్పడతామని తెలిపారు. ఈ పాఠశాలకు మండలంలో మంచి పేరు ఉందని దీనిని ఇలాగే కొనసాగించాలని దానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించడంలో ముందుంటామని పేర్కొన్నారు.

నిర్మాణంలో ఉన్న కల్యాణమండపం

కల్యాణమండపం నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని దేవళంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయానికి అనుసంధానంగా కల్యాణ మండపం ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపం రెండవ అంతస్తు పూర్తి స్థాయిలో నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం సంబేపల్లి మండలం ఎస్‌సోమవారం పంచాయతీ ఎస్‌సోమవారంనకు చెందిన రాళ్లపల్లి సురేంద్ర రూ.50 లక్షలు విరాళం ప్రకటించినట్లు ఆలయ కమిటీ సభ్యులు మల్లికార్జున నాయుడు, మాధవయ్య నాయుడులు తెలిపారు. కల్యాణ మండపం రెండవ అంతస్తుకు అయ్యే ఖర్చు మొత్తం భరిస్తున్నారని అన్నారు. శ్రీ కామాక్షి సమేత సిద్ధేశ్వర స్వామి కల్యాణ మండపం నిర్మాణానికి ఉదార స్వభావంతో ముందుకు వచ్చి సుమారు 50 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చి సురేంద్ర తన దాతృత్వం చాటుకున్నారని పేర్కొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఆలయాలు శుభ్రం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

హిందూ దేవా ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం మరియు ఆంజనేయస్వామి దేవస్థానం, శివాలయంలో ఆదివారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేశారు .దేవాదాయ శాఖ ఎఒమునిరాజు, చెన్నకేశవ స్వామి ఆలయ పూజారి చెన్నకేశవులు ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఆలయాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించడం జరిగిందన్నారు.

సిద్ధయ్యను సన్మానిస్తున్న బిఎస్‌పి నాయకులు

బిఎస్‌పి మండల అధ్యక్షులుగా సిద్ధయ్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ ఆదేశంతో అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జ్ మిద్దెపల్లె బాలాజీ ఆధ్వర్యంలో తంబళ్లపల్లి నియోజకవర్గ అధ్యక్షులు పెద్దపాలెం సోముశేఖర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పెద్దపాలెం మల్లికార్జున సమక్షంలో బి.కొత్తకోట మండల అధ్యక్షులుగా గుంటిపల్లి సిద్ధయ్యను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక మాన్యశ్రీ కాన్షీరాం మార్గంలో ఆయన కుమారి మాయావతి నాయకత్వంలో ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీల కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బిఎస్‌పినాయకులు కార్యకర్తలు, పిటిఎం నరసింహులు, పవన్ రఘు,పలక సంతోష్ భాస్కర్, బిల్లు, శ్రీను, రాజు, మోహనరావు, శ్రీనాథ్, సూరి, గోవర్ధన్, రామాంజి, అంజి పాల్గొన్నారు.

కెవిఆర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని కెవిఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కెవిఆర్ ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యంతో శనివారం ఒకరు మృతి చెందారని, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారన్నారు. ఈ ఆస్పత్రిలో నిత్యం రోగులు ఏదో సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కెవిఆర్ హాస్పిటల్‌పై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు, ఆందోళనలు జరుగుతున్నా జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా వైద్య శాఖాధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించి సంబంధిత హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో చిన్న, రమణయ్య పాల్గొన్నారు.

ఐక్యంగా మన హక్కులను సాధించుకుందాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఐక్యంగా మన హక్కులను సాధించుకుందామని సమన్వయకర్త కొమ్ము నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం పులివెందుల అసెంబ్లీ పరిధిలోని వివిధ మండలాల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, కార్యవర్గ సభ్యులు, మాదిగ ఉద్యోగుల సమాఖ్య, మహాజన సోషలిస్ట్ పార్టీ కార్యకర్తలు సమావేశమయ్యారు. కొమ్ము నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాదు నగరంలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన 1000 గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గం నుండి తప్పక కళాకారులుపాల్గొనాలని ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళితవాణి జెసి రామాంజనేయులు, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకె గంగరాజు మాట్లాడారు. సాకె చరణ్ కుమార్ మాదిగ, లింగాల రమేష్ మాదిగ, ఉత్తయ్య మాదిగ, రామచంద్రుడు మాదిగ, రామాంజనేయులు మాదిగ, రమేష్ మాదిగ, బాబు మాదిగ, ఓబులేష్ మాదిగ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిచ్చికుక్క వీరంగం : 10 మందికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ /మొలకలచెరువు

మొలకలచెరువు మండలంలో ఆదివారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. అడవిచెరువు గ్రామం వద్ద జనం గుంపులోకి చొరబడిన పిచ్చికుక్క అక్కడున్న పలువురిపై తీవ్రంగా దాడి చేసి కాటు వేసింది. అక్కడ నుంచి పరుగులు పెడుతూ చౌడసముద్రం, అడవినాయుని చెరువుపల్లి, గుట్టకిందపల్లి, గూడుపల్లి ప్రాంతాల్లోకి చొరబడి అక్కడ ఆ ప్రాంతవాసులపై దాడిచేసి కాటు వేసి తీవ్ర గాయాల పాలు చేసింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మొలకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు పెట్టారు. అయితే అక్కడ కుక్క కాటుకు ఇచ్చే రేబిస్ టీకాలు అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యను తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజుకు విన్నవించారు. సకాలంలో స్పందించిన త్యాగరాజు బాధితులను హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి రప్పించారు. ఇక్కడ వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడి బాధితులందరికీ టీకాలు వేయించారు. అడివినాయుని చెరువుపల్లెకు చెందిన వృద్ధుడు వెంకటప్ప పై పిచ్చి కుక్కదాడి తీవ్రస్థాయిలో ఉండడంతో ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ చాలా అత్యవసరమైన రేబిస్ టీకాలు అన్ని పిహెచ్‌సిల్లో

కుక్కకాటు బాధితులను పరామర్శిస్తున్న త్యాగరాజు

అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కేంద్రంలోని 15 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్క కాటు టీకాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి లో అత్యవసర ఇంజక్షన్లు ఉండేలా చూసుకోవాలన్నారు. బాధితులందరిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గోపాలం శివన్నారాయణ

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని ఆదివారం ప్రతిభా జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసినటువంటి ఫిట్స్ మెడికల్ క్యాంప్ విజయవంతమైనట్లు మానవతా చైర్మన్ శివ గంగి రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపకులు హరినాథ్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. విజయవాడ నుంచి వచ్చిన డాక్టర్ గోపాలం శివన్నారాయణ రోగులకు పరీక్షించి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. జిబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గోపాలం శివన్నారాయణ పేర్కొన్నారు. మనిషికి ఒత్తిడి ,కోరికలు ఎక్కువైనప్పుడు అనేక జబ్బులు వస్తాయని తెలిపారు. మానసికంగా దృఢంగా ఉన్న వారికి చాలా జబ్బులు రావని పేర్కొన్నారు.ప్రతి రెండు నెలలకోసారి ఈ క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ రెడ్డిశివగంగిరెడ్డి, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి ,లైన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపకులు హరినాథ్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు రామయ్య ,ప్రతాపరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొల్పిన వేమన పద్యాలు

మదనపల్లి: వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తన పద్యాలతో సామ్యవాద సిద్ధాంతాన్ని ఎలిగెత్తి చాటిన సామ్యవాద ప్రజాకవి యోగి వేమన అని ఆయన జయంతి వేడుకల్లో విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ కొనియాడారు. స్థానిక బాస్ కార్యాలయం లో వీసీకే పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన సంయుక్తంగా యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించాయి. ఈసందర్భంగా బాస్, విసికె నాయకులు వేమన చిత్రపటానికి పుష్పములు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ తోపాటు బాస్ గౌరవాధ్యక్షుడు ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, యువ పారిశ్రామిక వేత్త మెండెం శ్రీనివాస్ మాట్లాడుతూ వేమన పద్యాలలో లోక నీతులు, సామాజిక రీతులు, సామాజిక చైతన్యానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉంటాయని, కుటుంబ వ్యవస్థలోని లోటు పాట్లు, మతం పేరుతో జరుగుతున్న అరాచకాలు, దోపిడీలు, విగ్రహారాధనలోని మౌఢ్యం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు ఇలా కనిపించిన ప్రతీ సామాజిక రుగ్మత మీదా వేమన తన కలం ఝళిపించాడని చెప్పారు. కార్యక్రమంలో బాస్, విసికె నాయకులు చాట్ల బయన్న, పెద్దపాలెం రవిశంకర్, తలారికృష్ణ, జనార్దన్, బురుజు చంద్ర, నరసింహులు, ఇర్ఫాన్, శరత్, తరుణ్, సి.కళ్యాణ్, బైనేని సురేష్ పాల్గొన్నారు.

రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

సమాజాన్ని మేల్కొల్పడంలో యోగి వేమన నీతి పద్యాలు ఎంతో దోహదపడ్డాయని రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కనుగొండ మద్దిరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన జయంతి ఉత్సవాలనుస్థానిక బెంగుళూరు రోడ్డులోని రెడ్డి సంక్షేమ సంఘం భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన తన నీతి పద్యాలతో సమాజంలో చైతన్యం కల్గించారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, జాయింట్ సెక్రెటరీ సుధాకర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, అడ్వకేట్ శేషారెడ్డి పాల్గొన్నారు. **పీలేరు:** వేమన పద్యాలు సమాజ అభివృద్ధికి సోపానాలని ప్రముఖ పద్య కవి జలకనూరు మురళీధర్ రాజు తెలిపారు. మహాకవి వేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో వేమన చిత్ర పటానికి పూల మాలవేసి, ఘనంగా నివాళులు అర్పించారు. రాయలసీమ వాసి అయిన ఆయన తన

పీలేరు: వేమన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పద్యాలతో సమాజానికి నీతిని బోధించాడని వేమన పద్యాలు ప్రజలు విద్యార్థి దశ నుంచి నేర్చుకోవడం వల్ల మానవ మనుగడకు చక్కని నీతి కలిగి ఉందని అలాంటి నీతిని సమాజానికి పంచారని అన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు నాగరాజ, మాధవి, ఉపాధ్యా యులు క్రిష్ణమూర్తి, వెంకట్రణ, తెలుగు ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, జయచంద్రారెడ్డి, గంగయ్య, అశోక్ కుమార్, తెలుగు భాష పాల్గొన్నారు

ఎమ్మెల్యే స్థానాన్ని మళ్లీ కైవసం చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఒబిసి ఓటు మనదే.. సీటు మనదే అనే నినాదంతో రాబోయే ఎన్నికల్లో జమ్మలమడుగులో మళ్లీ బిసిలు ఎమ్మెల్యే స్థానాన్ని కైవసం చేసుకోవాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొ న్నారు. ఆదివారం స్థానిక నాగుల కట్టలోని శ్రీచౌడేశ్వరి ఫంక్షన్ హాల్‌లో బిసి సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ జమ్మలమడుగు అధ్యక్షులు జోల్లు కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనవాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీల్లో బిసిలకు రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. 75ఏళ్లు గడిచినా సామాజిక సమానత కనబడడం లేదన్నారు. జ్యోతి బాపూలే సామాజిక స్ఫూర్తితో, అంబేద్కర్ రాజ్యాంగ భావజాలంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బిసిలకు కుల జనగణన జరపాలని కోరారు. బిసిలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్లో పాస్ అయ్యేవరకు ఉద్యమించాలని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో మహిళా సబ్ కోట ఇవ్వాలన్నారు. జమ్మలమడుగు తొలి ఎమ్మెల్యే కీర్తిశేషులు కుండా రామ య్య ఆదర్శంతో రాబోయే ఎన్నికల్లో బిసిలు చైతన్యవంతులై పోగొట్టుకున్న ఎమ్మెల్యే స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు కేశవ శంకర్రావు మాట్లాడుతూ బిసిల గడ్డ జమ్మలమడుగు గడ్డ అని తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం యాదవ సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, 20 బిసి కుల సంఘాల నేతలు, బిసి సంక్షేమ సంఘం జిల్లా జిల్లా అధ్యక్షులు లింగమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి కాటా రామదాసు, ప్రధాన కార్యదర్శి మేడికుర్తి జీవన్ కుమార్, ఉపాధ్యక్షులు అంబవరం రామయ్య, పొన్నతోట శీను పాల్గొన్నారు.

కనీస వసతులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం : మండలంలోని కాంపల్లెలో నిర్మించిన ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీలో కనీస వసతులకు సంబంధించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం కాం పల్లెలో హౌసింగ్ పీడీ రాజారత్నంతో కలిసి ఆయన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 2016-17లో ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీ పేరుతో 42 ఇళ్ల మంజూరయ్యాయని తెలిపారు. అప్పట్లో ఇంటి నిర్మాణాలు చాలావరకు పూర్తి కాలేదన్నారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ కాలనీ పట్ల నిర్లక్ష్యంతో నేటికీ లబ్ధిదారులు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. కాలనీలో డ్రయినేజీ, తాగునీటికి సంబంధించి పను లను పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీ నియోజవర్గంలోనే ఓ మోడల్‌గా తీర్చిదిద్దడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రమణారెడ్డి, ఎఇ వాసుదేవరెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యుత్ కార్మికులకు తెలుగుదేశం ప్రభుత్వం ఎల్లప్పటికీ అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు మద్దూరు వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తెలుగునాడు విద్యుత్ కార్మికుల సంఘం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లెటి రామిరెడ్డి, డివిజనల్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, దామోదర్‌తోపాటు సభ్యులు కలిసి తెలుగునాడు విద్యుత్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని విత్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. డివిజన్‌లో యూనియన్ బలోపేతానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మహాకవి యోగి వేమారెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముద్దనూరురోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ రెడ్డి నాయకులు హాలు గంగాధరరెడ్డి, విశిష్టఅతిథిగా హాజరైన విశ్రాంత డిగ్రీ కళాశాల అధ్యాపకులు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం రెడ్డివెల్ఫేర్ సొసైటీ సహకారంతో 30 మంది విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు వేమన కీర్తి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుం దన్నారు. వేమారెడ్డి విగ్రహాన్ని పులివెందులలో ఒక ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసి, భావితరాలకు ఆయన గొప్పతనాన్ని, నీతిపద్యాలను తెలియ జేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, హిందూ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎన్ఆర్‌వి ప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు యడుగూరి శ్రీనివాసరెడ్డి, రెడ్డి వెల్ఫేర్ సొసైటీ పులివెందుల నాయకులు చప్పిడి కృష్ణారెడ్డి, రామాపురం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని జమ్మలమడుగు అధ్యక్షులు వీరబ్రహ్మాచారి స్వామి తెలిపారు. ఆదివారం నాగులకట్ట వద్ద ఆయన మాట్లాడుతూ రైతులకు పరికరాలను, మహిళలకు ఆభరణాలు, గృహ సంబంధ పరికరా లను తయారు చేస్తూ సమాజం ముందుకు నడవడంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. విశ్వబ్రాహ్మణ వారిని గుర్తించి వారి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించా లన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ ఆచారి, రమణయ్య ఆచారి, లక్ష్మయ్య ఆచారి, వీర నారాయణ ఆచారి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యా యులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయా లని ఎస్‌సి, ఎస్‌టి ఉపా ధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఆదివారం ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు అయినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా 2022 నుంచి సరెండర్ లీవ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి స్పం దించి పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను మంజూరు చేయాలని, 30శాతం ఐఆర్ వెంటనే మంజూరు చేయాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేంద్రగుత్తి గంగరాజు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి. శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సి.సుదర్శన్ బాబు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలని వైఎంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు పిలుపునిచ్చారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం సోమవారం నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, ఫార్మాసిస్ట్ దినేష్, స్టాఫ్ నర్సులు విజయశాంతి, రాజకుమారి పాల్గొన్నారు.

సమావేశమైన బిటి కళాశాల పూర్వపు విద్యార్థులు

భాస్కరాచారికి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అని బెసెంట్ ఓల్డ్ స్టూడెంట్ సర్వీస్ యాక్టివిటీ అధ్యక్షుడిగా డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల జనరల్ బాడీ మీటింగ్‌లో గౌరవ అధ్యక్షులుగా గంగారపు గౌతంరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగార్జునబాబు (గాంధీ), జనరల్ సెక్రెటరీగా మేకల రాజశేఖర్‌రెడ్డితోపాటు పలువురు కార్యవర్గ సభ్యులను నియమించారు.ఈ సందర్భంగా డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ బిటి కాలేజి పూర్వ విద్యార్థిగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి విద్యా సామగ్రి అందజేయడంతోపాటు, ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్య శిభిరాలు ఏర్పాటు చేయడంతో మందులను అందిస్తామని తెలిపారు. శత సంవత్సరాల చరిత్ర కలిగిన కళాశాల పూర్వ విద్యార్థులుగా తామంతా కలసి కళాశాల పేరును మరింత ఇనుమడింప జేయడంతో పాటు పూర్వ వైభవం తీసుకు రావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాందాస్ చౌదరి, మార్పూరి శశిధర్ రావు, ఎంపిటిసి ఉదయ్ కుమార్, మాజీ సైనికుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, మలిగి మధుసూదన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి, మాజీ కరస్పాండెంట్ డాక్టర్ వై.యస్.మునిరత్నం, యువ నాయకుడు సాయిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో సోమవారం నుండి పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. 20న సోమవారం బద్రిపల్లి, 21న చిన్నగురవలూరు, 22న చెంచుపల్లి, 23న గాంధీనగర్, 25న ఖాదర్‌పల్లి, 27న మొద్రాయపల్లి, 28న నరహరిపురం, 29న ద్వారకానగరం, 30న వెదురూరు, 31న అన్నవరం గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పశువైద్య శిబిరాల్లో తేలికపాటి శస్త్ర చికిత్సలు, ఎదకురాని పశువులకు గర్భకోశ సంబంధమైన పరీక్షలు, నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. పాడి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామానికి చెందిన నలుగురు రోడ్డుప్రమాద బాధితులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల చిన్నగురువలూరుకు చెందిన యువకులు ఎర్రమాచు రాజేష్ రెడ్డి, కె.శివానందరెడ్డి, పి.శ్రీధర్రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్సలో భాగంగా ఇంటి వద్ద ఉన్న వీరిని మాజీ ఎమ్మెల్యే పరామర్శించి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామం లోని పలువురి ఇళ్లకు వెళ్లి పలకరించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, వివేకానంద స్కూల్ కరస్పాండెంటు నాగేశ్వర్‌రెడ్డి, అల్లాడుపల్లె సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, శివారెడ్డి, రాజారెడ్డి, చంద్రఓబుళరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో జెష్మికి బంగారు పతకం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీలో మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సి.జెష్మి గోల్డ్ మెడల్ సాధించింది. నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలో బ్రాంజ్ మెడల్, మహారాష్ట్ర నాందేడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. ఇండో నేపాల్ జంపురోప్ ఛాంపియన్ షిప్-2025 పోటీలకు ఎంపికైంది. ఈనెల 5 నుండి 9 వరకు నేపాల్ దేశంలో జరిగిన జంప్‌రోప్ పోటీల్లో వివిధ దేశాలతో పోటీపడి అండర్-14 బాలికల సైక్లింగ్ విభా గంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన సి.జెష్మిని తల్లి దండ్రులు చిన్న సుబ్బరాయుడు, జాస్లీన్, బాలికల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఎస్ఎపిఇ పుష్పలత, తెలుగు ఉపాధ్యాయుడు కొండారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ హాకీలో సత్తా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ హాకీలో బి.అరవింద్ మొదటి స్థానం సాధించాడు. ఈ నెల 17 నుండి 19 వరకు మూడు రోజులు పాటు మదనపల్లిలో హాకీ అసోషియేషన్ అధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ సత్యనియర్స్ విభాగంలో సింహాద్రిపురం మండలం బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 9వ తరగతి చదువుచున్న బి.అరవింద్ కడప జిల్లా జట్టులో అత్యంత ప్రతిభ కనబరచి, మొదటి స్థానం సాధించాడు. తన ఈ విజయం పట్ల పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రామాం జనేయులు, రిటైర్డ్ పిఇటి రేణుకా దేవి ప్రోత్సాహం మరువలేదని విద్యార్థి పేర్కొన్నారు. విద్యార్థి విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాసు, బోధన, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కడప 'ఉక్కు' సంగతేమిటి? : పిసిసి

ప్రజాశక్తి - కడప

విశాఖ ఉక్కు సంగతి సరే. మరి కడప ఉక్కు సంగతేమిటనీ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలను ప్రశ్నిం చారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో 13 వ షెడ్యూలు ప్రకారం విభజన జరిగిన 6 నెలల లోపల సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఉందని చెప్పారు. పదేళ్ల తరువాత అయినా అతీగతీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సి.కె. దిన్నె, జమ్మలమడుగు, మైలవరం ~ అనేక మండలాల్లో అవసరమైన భూమి ఉందని, నీటికి సంబంధించి గండికోట, మైలవరం, బ్రహ్మ సాగర్, సోమశిల జలాశయాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఆర్‌టిపిపి, రవాణాకు సంబంధించి రోడ్డు, రైలు, విమాన, జల రవాణా సౌకర్యాలున్నాయని పేర్కొన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని వుంది అన్నట్లుంది కడప జిల్లా నిరుద్యోగుల పరిస్థితి ఆయన పేర్కొన్నారు. .బిజెపి మోసగారితనం, ప్రాంతీయ పార్టీల చేతగా నితనం దీనికి కారణం అన్నారు. 2018లో ఎన్నికలకు ముందు మైలవరం మండలం, కంబాల దిన్నే గ్రామం వద్ద రాయల సీమ స్టీల్స్ లిమిటెడ్ పేరుతో అప్పట్లో ముఖ్య మంత్రి హోలోదాలో చంద్రబాబు ఉక్కు కర్మాగారానికి శంఖు స్థాపన చేశారు, 3,892 ఎకరాలు కేటాయించారు .కానీ పైసా పనికూడా జరగలేదు అన్నారు. మళ్ళీ అధికారంలోకి వచ్చి 7 నెలలయింది. ఉక్కు ఊసే లేదు అన్నారు. కడప జిల్లా అంటే అంత చులకనా భావమా? నిర్లక్ష్యమా? అని ప్రశ్నించారు. ఇలాగే ప్రవర్తిస్తే రాబోవు ఎన్నికల్లో టిడిపి కూటమి కి జిల్లాలో ఒక సీటు కూడా రాదని తులసి రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కడప అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బండి జకరయ్య,సత్తార్,ప్రసాద్ గౌడ్,రఫీక్, శ్యామలమ్మ, నాగరత్నం, మైనుద్దీన్, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగ రాజు, రమణ, వినయ్ పాల్గొన్నారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం.. మండల వాసి మృతి

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని ఎలకపల్లి పంచాయతి కురప్పల్లి గ్రామనికి చెందిన నారాయణస్వామి(60) కర్ణాటకలో రోడ్డు ప్రమాదం మృతి చెందాడు. మృతుడు బంధువుల వివరాల మేరకు..కర్ణాటకలో బంధువుల గృహప్రవేశ కార్యక్రమానికి ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కొలారు జిల్లా శ్రీనివాసపురం తాలూకాలోని లక్ష్మీపురం క్రాస్ సమీపంలోని సెల్ పెట్రోల్ బంక్ వద్ద ఓ ప్రయివేట్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కురప్పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.